క్లుప్తంగా

ఉరుకుంద అసిస్టెంట్ కమిషనర్‌గా వాణి



కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్‌గా వాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ గత నాల్గు సంవత్సరాలు అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నానని, ఫిబ్రవరిలో చైల్డ్‌కేర్ లీవ్‌లో వెళ్లినట్లు తెలిపారు. ఆమె సెలవుల్లో వెళ్లడంతో ప్రభుత్వం ఇక్కడకు అనంతపురం దేవదాయశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న రామాంజనేయులుకు అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది. ఆయన రెండు నెలల పాటు విధులు నిర్వర్తించారు.

ముతవల్లిపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జామియా మసీదు పెద్దలు

కౌతాళం: స్థానిక జామియా మసీదు ముతవల్లి అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆఫీజ్ ముల్లా హుసేన్ ఆధ్వర్యంలో ముల్లా మేటీలు కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ఎన్నిమిదేళ్లుగా ముతవల్లి ముల్లా దనిఫ్ మసీదుకు వచ్చే లావాదేవీలను అనుభవిస్తున్నారని, వాటికి సంబంధించిన లెక్కలు చూపడం లేదని ఆరోపించారు. ఎన్నిమిదేళ్లగా 7మసీదు కాంప్లెక్స్ బాడుగల లెక్క దాదాపు రూ.20లక్షలు స్వాహా చేశాడన్నారు. అలాగే మసీదు అభివృద్ధి నిధులకు కూడా లెక్కలు లేవని చెప్పారు. అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


రామలింగేశ్వరుడి ఆలయ ప్రారంభోత్సవం



రామలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న దృశ్యం

మంత్రాలయం : మండలంలోని సూగూరు గ్రామంలో రూ.కోటితో నూతన శిలామంటప ఆలయాన్ని నిర్మించారు. సోమవారం ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా గణపతి పూజ, శాంతి, వాస్తు హోమాలు జరిపించారు. వేకువ జామున 4 గంటలకు ధ్వజస్తంభ, శిఖరాగ్రాన కలశ ప్రతిష్ఠాపన చేపట్టారు. అర్చకులు గౌతమి స్వామి నేతృత్వంలో జలాభిషేకం, మహా రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, నమక, చమక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వై.సీతారామిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్వజ ప్రతిష్ఠోత్సవం ప్రారంభం



ధ్వజ స్తంభ కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలోని డి.బెళగల్ గ్రామంలో రంగస్వామి, లక్ష్మీదేవి ఆలయంలో సోమవారం వేకువ జామున నుంచి వేదపండితులు మూర్తి స్వామి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం, ఆకు పూజ, ఫల,పుష్పాలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం గ్రామ పెద్దలు సమక్షంలో గ్రామ పురవీధుల్లో కలశాలు, మేళతాళాలతో ధ్వజ స్తంభ, గోపుర కలశాలను ఊరేగింపుగా ఆలయం చెంతకు చేర్చారు. మంగళవారం హోమాలు, గణపతి పూజ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. బుధవారం మంత్రాలయం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థుల వారు ధ్వజస్తంభం, గోపుర కలశాల స్థాపన పూజలు నిర్వహిస్తారని చెప్పారు.

బీసీలకు టీడీపీ చేసిందేమిటి?

ఆదోని టౌన్ : యువగళం పాదయాత్రలో భాగంగా జిల్లాలో పర్యటించిన నారా లోకేష్ బీసీలను అవమాన పరిచేలా మాట్లాడారని, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు తెలిపారు. తమది బీసీల పార్టీ అని చెప్పుకునే నారా లోకేష్.. బీసీలకు చేసిందేమిటని ప్రశ్నించారు. సోమవారం బోయ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో భీమాస్ ఫంక్షన్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 139 కులాలు ఉన్నటువంటి బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. నాయకులు చెన్నబసప్ప, దేవిశెట్టి ప్రకాష్, శేషన్న, వీరేష్, రాముడు, వీరభద్ర పాల్గొన్నారు.

రైతు ముంగిటకే సేవలు

- ఊరూరా రైతు భరోసా కేంద్రాలు
- స్థానికంగానే అన్ని రకాల సేవలు
- రైతులకు తప్పిన వ్యయ ప్రయాసలు



నాగనాథనహళ్లిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయా శాఖ సిబ్బంది (ఫైల్)

ఆదోని రూరల్ : గ్రామంలోనే రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సేవలన్నీ అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గ్రామ సచివాలయానికి అనుబంధంగా ఆర్బీకేలను ఏర్పాటు చేసి ఆధునిక సౌకర్యాలు కల్పించారు. మట్టి నమూనాల సేకరణ నుంచి దిగుబడిని విక్రయించుకునేంత వరకు రైతులకు అండగా నిలిచేలా చర్యలు చేపట్టారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, ఆధునిక సమాచారం, మార్కెటింగ్, ధరలు తదతర వాటిని కేంద్రాల ద్వారా అందుతున్నాయి. ఆదోని మండలంలో 41 గ్రామ పంచాయతీలు ఉండగా 37 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం రైతులు 25,363 ఉండగా, సాగు భూమి 89,557 ఎకరాలు ఉంది.

ప్రయోజనమిలా..

రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు పంటల సమాచారం, ఆన్‌లైన్‌లో పంటల నమోదు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ ధరలు, ఆధునిక సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారం, కౌలు కార్డులు పొందవచ్చు. అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చు. అంతేగాకుండా బ్యాంకు లావాదేవీలు చూసుకునే అవకాశం కూడా ఉంది. మట్టి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపి వాటి ఫలితాలను రైతులకు తెలియజేసి వాటి ఆధారంగా పంటల సాగు, ఎరువులు, మందుల వినియోగం, సస్యరక్షణ చర్యలను వివరిస్తారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ యంత్రాలు, ఇతర వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేస్తున్నారు. ఇక ఎప్పటికప్పుడు వివిధ ప్రాంతాల్లో తమ దిగుబడులకు సంబంధించిన మార్కెట్, మద్దతు ధర తెలుసుకోవచ్చు. రైతు గ్రంథాలయం ద్వారా వివిధ పుస్తకాలను అందుబాటులో ఉంచింది. వీటి ద్వారా పంటలకు సంబంధించిన వివరాలు, నూతన పద్ధతులు తెలుసుకోవచ్చు. కేంద్రాల్లోని టీవీల్లో రైతులకు ఉపయోగపడే సలహాలు, పంట సాగు మెళకువలను చూడవచ్చు. జిల్లా వ్యవసాయ అధికారుల సందేశాలను లైవ్‌లో చూడవచ్చు.



పెసలబండ గ్రామంలో ప్రారంభమైన రైతు భరోసా కేంద్రం



రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

	రైతులు	సాగు భూమి (ఎకరాలు)
సన్నకారు రైతులు	13,254	17,613
చిన్నరైతులు	6,923	24,045
చిన్న, మధ్యస్థ రైతులు	3,803	25,422
మధ్యస్థ రైతులు	1,269	19,564
పెద్ద రైతులు	144	4,911

అవస్థలు తప్పాయి



నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. గతంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం 20 కి.మీ. దూరంలో ఉన్న ఆదోనికి వెళ్లి తెచ్చుకునేవాళ్లం. ప్రస్తుతం గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో అన్నిరకాల సేవలు అందుతున్నాయి. మూడేళ్లుగా నాకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందులోనే తీసుకుంటున్నా.
– డి.బసిరెడ్డి, పెద్దతుబళం రైతు

విత్తనాలు, ఎరువులు తీసుకుంటున్నాం



గతంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తీసుకునేందుకు ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. ఆదోని నుంచి మా గ్రామానికి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు తెచ్చుకునేందుకు రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. గత రెండేళ్లుగా రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ వేరుశనగ, పత్తి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తీసుకుంటున్నాం. దీంతో వ్యయ ప్రయాసాలు తగ్గిపోయాయి.
– బి.సి.విరుపాక్షి, రైతు, గణేకల్,

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



మండలంలోని 41 గ్రామ పంచాయతీలకు గానూ 37 పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశాం. వాటిల్లో వ్యవసాయ సిబ్బందిని కూడా నియమించాం. వారు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై వివరిస్తున్నారు. అలాగే దిగుబడులను రైతు భరోసా కేంద్రాల్లోనే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పంట నష్టపరిహారం, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్రాలు అన్నీ అక్కడే లభిస్తాయి. యంత్ర పరికరాలు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకుంటే అందించేందుకు చర్యలు తీసుకుంటాం. – పాపిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఆదోని రూరల్ : మండలంలోని రారావి గ్రామం వద్ద కర్నాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఇస్పీ ఏఎస్ఐ చంద్ర సోమవారం తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన కాశీ విశ్వనాథ్, శ్రీనివాసులు కేఏ37ఆర్9114 అనే మోటార్ బైక్‌పై రారావి గ్రామం నుంచి కోడుమూరుకు కర్నాటక మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని వారి నుంచి 180 ఎం.ఎల్., 90 ఎం.ఎల్ పరిమాణం గల మొత్తం 21 బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దిబ్బనకల్ క్రాస్ వద్ద..

మండలంలోని దిబ్బనకల్ గ్రామ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆస్పరి మండలం గార్లపెంట గ్రామానికి చెందిన కడిమెట్ల సురేంద్ర 96 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ కర్నాటక మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రచ్చమర్రిలో పోలీసు పికెట్ ఏర్పాటు

మంత్రాలయం రూరల్: మండలంలోని రచ్చమర్రి గ్రామంలో మాధవరం పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలోని కొందరు వడ్డీ వ్యాపారులు అమయాక ప్రజలను వేధిస్తున్నారని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఎస్పీ ఆదేశాల మేరకు పికెట్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గోపుర కలశ ప్రతిష్ఠోత్సవాలు

ఎమ్మిగనూరు: పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో వెలసిన శ్రీ వేంకటసాయి దేవాలయంలో నూతనంగా నిర్మించిన సింహద్వార, గోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం వైభవంగా ప్రారంభయ్యాయి. మూడు రోజుల పాటు ఆలయంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి



ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గుమ్మనూరు నారాయణ

ఆలూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం తన వంతుగా కృషి చేస్తానని గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో కార్యదర్శి శాంతకుమార్ ఆధ్వర్యంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాలకవర్గం సభ్యులతో యార్డు అభివృద్ధి పనులు, పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలపై చర్చించారు. యార్డులో పంట దిగుబడులను నిల్వ ఉంచేందుకు అవసరమైన గోదాములు ఏర్పాటు చేస్తామన్నారు. యార్డు వైస్ చైర్మన్ చిన్న ఈరన్న, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం యార్డు చైర్మన్, కమిటీ సభ్యులు మంత్రి మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వేగంగా స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు



ఇందిరానగర్‌లో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: పట్టణంలో మూడు రోజులుగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి భారీగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ అధికారులు నేలకొరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయడం, పనిచేయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం ఇందిరానగర్, ఎరుకల కాలనీ, గలీజు గుంతలు, ఎస్కేడీ కాలనీ, బండిమెట్ట తదితర ప్రాంతాల్లో పనులు చేపట్టారు. మండిగిరి ఏరాయాలో ఐదు లైన్లకు మరమ్మతులు చేశారు.

వివాహిత ఆత్మహత్య

ఆలూరు రూరల్: హాలహర్వికి చెందిన ప్రశాంతి (21) అనే వివాహిత సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు.. హాలహర్వికి చెందిన శకుంతల, మల్లికార్జున దంపతుల కుమార్తె ప్రశాంతి కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో పురుగు మందు తాగడంతో బంధువులు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. బదినేహాల్‌కు చెందిన సోమేష్‌తో వివాహం కాగా ఆరు నెలల క్రితం విడాకులు తీసకున్నారు.

పేరుకే పోలీస్ అవుట్ పోస్టు..



ఈరన్న స్వామి ఆలయం ఎదురుగానున్న పోలీస్ అవుట్‌పోస్టుకు తాళం వేసిన దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. శ్రావణమాసంలో జరిగే ఉత్సవాలకు సుమారు 20 లక్షల మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఇక ప్రతి సోమ, గురువారాల్లో వేల సంఖ్యలో తరలివస్తారు. అలాగే అమావాస్య రోజు సుమారు 40వేల మంది వరకు భక్తుల స్వామి వారిని దర్శించుకుంటారు. ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నా.. ఇక్కడ ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, దొంగతనాలు జరగకుండా పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ హోంగార్డులు విధులు నిర్వర్తింస్తుండటంతో దొంగతనాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఈ ఏడాది మార్చి 12న గర్భగుడి ఎదురుగా ఉన్న హుండీలో చోరీ జరిగి సుమారు రూ.లక్షన్నర వరకు సొమ్మును దొంగలించారు. అయితే అనంతరం దొంగలతో పాటు సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పత్తికొండ నియోజకవర్గం పుచ్చకాయలమాడకు చెందిన మహిళ సెల్ ఫోన్‌ను అపహరించారు. అయితే ఈ విషయంపై తన ఫిర్యాదును ఎవరికి చేయాలో తెలియక బాధితురాలు దేవాలయ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు అవుట్ పోస్ట్‌లో సంప్రదించాలని చెప్పగా.. అక్కడి వెళ్తే తాళం వేసి ఉండటంతో ఆమె వెనుదిరిగింది. విషయాన్ని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి దృష్టికి తీసువెళ్లగా.. దేవాలయంలో హుండీ దొంగతనం జరిగినప్పటి నుంచి హోంగార్డులను రాత్రి పూట విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చామని, అక్కడ పూర్తిస్థాయిలో సిబ్బంది లేరని, ప్రస్తుతం బందోబస్తు ఉండటంతో అక్కడ ఎవరూ విధుల్లో లేరని తెలిపారు.

భక్తులతో ఉరుకుంద కిటకిట



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి



దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆదివారం సెలువు రోజుతో పాటు సోమవారం కూడా కలిసి రావడంతో భక్తులు అధికంగా తరలివచ్చారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాత సేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల,పుష్పాలతో ఆలంకరించారు. మొక్కు చెల్లింపులో భాగంగా కొందరు భక్తులు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామి వారికి నైవైద్యం సమర్పించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఎం.ఎం.కాలనీలో నివాసముంటున్న పెంచులమ్మ మనవరాలు శ్రావణి (15) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. అయితే వారి ఆర్థిక పరిస్థితిని గమనించిన గాయిత్రీ ఫొటో స్టూడియో నిర్వాహకుడు వెంకటరమణ అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇదిలా ఉండగా..శ్రావణి చిన్నప్పుడే తల్లిదండ్రులు మృతిచెందారు. దీంతో అమ్మమ్మ నరసమ్మ, అవ్వ పెంచులమ్మ పెంచుతున్నారు. బాలికకు పుట్టుకతోనే మూర్ఛవ్యాధి ఉండేదని, దీంతో అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు.

అధికారుల పనితీరు మెరుగుపడాలి

ఆదోని టౌన్ : ప్రజలు మెచ్చేలా అధికారుల పనితీరు మెరుగుపడాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్పందనలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ వార్డుల పరిధిలోని మహిళలు, ప్రజలు సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. సమస్యలపై అర్జీలు చేసుకునే వారు తమ ఆధార్‌కార్డు నంబర్‌ను పొందుపరచాలని సూచించారు. అర్జీ అందజేసిన వారికి రశీదు ఇస్తామని చెప్పారు.

ఆక్యుప్రెజర్ శిబిరం ప్రారంభం

ఆదోని అర్బన్ : ఆవోపా, అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆక్యుప్రెజర్ శిబిరాన్ని స్థానిక కార్యాలయంలో ప్రారంభించారు. టీజీ పాండురంగయ్యశెట్టి, రాచోటి సుధాకర్, విట్టా రమేష్ శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ. వివిధ రకాల వ్యాధులను ఆక్యుప్రెజర్‌తో నయం చేసుకోవచ్చన్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన వైద్యులు ఆరు రోజుల పాటు ఉచితంగా చికిత్స చేస్తారని చెప్పారు. మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు సంగీత, మమత, సభ్యులు ప్రతాప్, హిమబిందు, మిర్యాల శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ‘స్పందన’ ధ్యేయం

- శనివారం లోపు పరిష్కారమయ్యేటట్లు చర్యలు తీసుకోవాలి
- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటి కప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్టీసీ డిపో మేనేజర్ రఫి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, బీసీ వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- గోనెగండ్ల మండలం జుమ్మలదిన్నె గ్రామానికి చెందిన దస్తగిరికి సర్వే నంబర్ 601/1లో 1.03 ఎకరాల భూమి ఉందని, దాన్ని కొందరు ఆక్రమించడానికి యత్నిస్తున్నారు, సర్వే చేసి హద్దు చూపాలని అర్జీ సమర్పించారు.
- పెద్దకడబూరు మండలం గొల్లదొడ్డి గ్రామానికి చెందిన మారెమ్మకు సర్వే నంబర్ 741/బీలో 2.42 ఎకరాల భూమి ప్రభుత్వం ద్వారా సంక్రమించింది. కొందరు మమ్మల్ని సాగు చేయనివ్వకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.
- హొళగుంద నుంచి ధణాపురం వరకు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోగిలతోట గ్రామానికి చెందిన రంగారెడ్డి విన్నవించారు.
- ఎమ్మిగనూరు మండలం ఏనుగుబాల గ్రామానికి చెందిన ఆరేకంటి విశ్వతేజకు సంబంధించి డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లో తన కుమారుడి పేరును సరిచేయాలని అర్జీ అందజేశారు.

కార్మిక చట్టాలను ఉపయోగించుకోవాలి

- లోక్ అదాలత్ జడ్జి నాగశ్రీనివాసరావు



మాట్లాడుతున్న జడ్జి నాగశ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): కార్మిక చట్టాలను కార్మికులు ఉపయోగించుకోవాలని లోక్ అదాలత్ జడ్జి నాగశ్రీనివాసరావు అన్నారు. సోమవారం కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చాంబర్ ఆఫ్ కామర్స్, మున్సిఫ్ కోర్టు దగ్గర వేడుకలు నిర్వహించారు. లోక్ అదాలత్ జడ్జి మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. కార్మికులు కూడా కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ, సంబంధిత శాఖలు, ఆటో, హమాలీ, బిల్డింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే వేడుకలు



కోసిగి బస్టాండ్ వద్ద జెండావిష్కరణ చేస్తున్న దృశ్యం



ఆదోనిలో జెండా ఎగురవేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆదోని రూరల్ : పట్టణంలో సోమవారం మే డే వేడుకలను ప్రజా, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఏఐటీయూసీ ఆదోని నియోజకవర్గ ఉప ప్రధాన కార్యదర్శి ప్రకాష్ ఆధ్వర్యంలో తిక్కస్వామి దర్గా ప్రాంతంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు స్వామి, దాసు తదితరులు జెండా ఆవిష్కరించారు. ఏరియా ఆస్పత్రి వద్ద ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప జెండా ఎగురవేశారు. ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మణి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి మల్లికార్జున, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం నాయకులు జగదీష్, నాగేంద్రప్ప, రమేష్, నరసప్ప, పీడీఎస్‌యూ నాయకులు రసూల్, అభి, మంజు, వెంకటేష్, ఉరుకుందు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో 22 ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సీనియర్ నాయకులు మహానందరెడ్డి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న, ఉపాధ్యక్షులు బి.వెంకటేశులు, జిల్లా కార్యదర్శి అంజిబాబు పాల్గొని మాట్లాడారు.

ఆదోని అర్బన్ : పట్టణంలోని లేబర్ కాలనీ, ఆర్ ఆర్ లేబర్ కాలనీలో సోమవారం ఉదయం మేడే వేడుకలను జిన్నింగ్ ప్రెస్సింగ్ అండ్ ఆయిల్ మిల్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించారు. నాయకులు నేతప్ప, భూపతి, వెంకటరావు, నీలకంఠ, శంకరన్న, నరసన్న, మూర్తన్న, ప్రసాద్, హనుమంతన్న పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో వివిధ గ్రామాల్లో సోమవారం కార్మిక సంఘాల నాయకులు మేడేను ఘనంగా నిర్వహించారు. సీపీఎం,సీఐటీయూ, సీపీఐ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించి స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఆయా సంఘాల జెండాలను ఆవిష్కరించారు. సీపీఐ సీనియర్ నాయకుడు మల్లయ్య కార్మిక దినోత్సం ప్రత్యేకత, విశిష్టతను వివరించారు. ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు, కార్యదర్శి నాగేంద్రప్ప, జగదీష్, సీపీఐ కార్యదర్శి ఈరన్న, అక్రమ్, గాదిలింగ, ఉల్లేష్, సిద్దప్ప, ఎల్లప్ప, రమేష్, మాబాషా పాల్గొన్నారు.

పెద్దకడబూరు : కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వాల తీరు మారాలని సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, వీరేష్, సీపీఎం నాయకులు పరమేష్, తిక్కన్న పేర్కొన్నారు. అంతర్జాతీయ మే డేను సోమవారం జరుపుకున్నారు. కల్లుకుంట, చిన్నతుంబళం, చిన్నకడబూరు ,పెద్దకడబూరులో ఎర్రజెండాను ఎగరవేశారు. నాయకులు ఆంజనేయ, తిక్కన్న, హనుమంతు, వీరేష్ సర్దార్‌పటేల్ పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలో కార్మిక దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఎర్ర జెండా ఆవిష్కరించారు. ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, రాముడు మాట్లాడుతూ కార్మికులు హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకుడు వీరేష్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు హెప్సిబా రాణి, లూసమ్మ, ఆశా వర్కర్ల నాయకురాలు సుజాత, వెంకటమ్మ, కార్మిక సంఘాల నాయకులు ఈరన్న, వీరారెడ్డి, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు రంగ, హనుమంతు, వీరేష్ పాల్గొన్నారు.